క్లుప్తంగా

ఆలయానికి పంచలోహ ఇత్తడి తొడుగు అందజేత



సర్పంచ్ సంజీవరావుకు ఇత్తడి తొడుగు అందజేస్తున్న దాతలు

మాడుగుల రూరల్: మండలంలో ఎం. కోడూరు గ్రామ ఆరాధ్య దైవం మోదమాంబ ఆలయానికి దాతలు 50 కిలోల పంచలోహ ఇత్తడి తొడుగును సర్పంచ్ గొల్లవిల్లి సంజీవరావు ద్వారా ఆదివారం అందజేశారు. ఎం. కోడూరు గ్రామానికి చెందిన ముమ్మిన అప్పారావు సోదరులు, వారి కుమారులు, కాకర అప్పారావు కుటుంబ సభ్యులు, సోమిరెడ్డి అప్పారావు కుటుంబ సభ్యులతో పాటు స్థానిక ఎంపీటీసీ సభ్యుడు ముమ్మిన రమణబాబు, పార్వతి దంపతుల ఆర్థిక సహకారంతో 50 కిలోల ఇత్తడితో తయారు చేసిన తొడుగును అందజేశారు. దీని విలువ రూ. 80 వేలు ఉంటుందని దాతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాసశర్మ, పడాల అప్పలనాయుడు, ఎస్. సముద్రం, కలిమి గోపాల్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ పనుల్లో రైతులు బిజీ



జీడి తోటలో దుక్కి దున్నుతున్న రైతు

గొలుగొండ: వారం రోజుల నుండి వర్షాలు కురుస్తుండడంతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. వేసవిలో వర్షం కురవడంతో జీడితోటల్లో దుక్కులు దున్నే పనులు చేస్తున్నారు. అలాగే పశుగ్రాసం పెంచడానికి, కూరగాయాల సాగు కోసం ఇప్పటికే రైతులు పనులు చేస్తున్నారు. ఏప్రిల్‌లో మంచి వర్షాలు కురవడం వల్ల మెరక పంటలకు ఎంతో మేలు జరుగుతుందని రైతులు అంటున్నారు.

వేసవి వేడిమితో జనం ఇక్కట్లు



అధిక ఉష్ణోగ్రత వల్ల నిర్మానుష్యంగా మారిన కె.కోటపాడు రోడ్డు

కె.కోటపాడు: గ్రామాల్లో వేసవి ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్నాయి. ఇటీవల ఎండలతో పాటు అడపాదడపా కురుస్తున్న వర్షాలతో ప్రజలు సేదదీరుతున్నారు. ఆదివారం అధిక ఉష్ణోగ్రత నమోదు కావడంతో పాటు తీవ్ర ఉక్కపోతతో వృద్ధులు, చిన్నారులు ఇబ్బందులు పడ్డారు. ఉదయం 11 నుండి సాయంత్రం 4 గంటల వరకు ప్రజల రాకపోకలు తక్కువగా ఉండడంతో రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. ప్రధాన కూడళ్లు జనసంచారం లేక బోసిపోయాయి.

గునుపూడి పీహెచ్‌సీలో అదనపు భవన నిర్మాణం



గునుపూడి పీహెచ్‌సీలో నిర్మిస్తున్న అదనపు భవనం

నాతవరం: మండలంలోని గునుపూడి పీహెచ్‌సీలో ల్యాబ్‌కు అదనపు భవన నిర్మాణ పనులు జరుగుతున్నాయి, ఈ పీహెచ్‌సీలో రోగులకు పరీక్షలు నిర్వహించేందుకు వసతి సముదాయం చాలక ఇరుకు గదిలోనే ల్యాబ్ నిర్వహిస్తున్నారు. ఈ సమస్యపై దృష్టి సారించిన ఉన్నతాధికారులు అదనపు భవనం కోసం ప్రతిపాదనలు సిద్ధం చేశారు. దీంతో ప్రభుత్వం రూ. 40 లక్షలు మంజూరు చేయడంతో పీహెచ్‌సీ ప్రాంగణంలో ఉన్న స్థలంలో అదనపు భవన నిర్మాణ పనులు చేస్తున్నారు. ప్రస్తుతం పునాది పనులు పూర్తి చేసి శ్లాబు పనులు చేపట్టారు. పనులు సకాలంలో పూర్తి చేస్తే పీహెచ్‌సీలో ల్యాబ్‌కు వసతి సమస్య తీరుతుంది. ఇటీవల భవన నిర్మాణ పనులను పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్, ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి, గునుపూడి సర్పంచ్ వేముల సూర్యనారాయణ, మాజీ ఎంపీటీసీ సభ్యుడు వేముల సూరిబాబు స్వయంగా పరిశీలించి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు.

మహాత్మా జ్యోతిరావు పూలే, అంబేడ్కర్ జయంతి నేడు

దేవరాపల్లి: మండల కేంద్రం దేవరాపల్లిలో మహాత్మ జ్యోతిరావుపూలే, బీఆర్ అంబేడ్కర్ జయంతి సోమవారం ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మండల అంబేడ్కర్ ఆశయ సాధన సంఘం ఆధ్వర్యంలో రైవాడ అతిథి గృహం ఆవరణలో నిర్వహించే జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని కమిటీ సభ్యులు కోరారు. ఈ సందర్భంగా పూలే, అంబేడ్కర్ చిత్రపటాల వద్ద ఘనంగా నివాళులర్పిస్తామన్నారు.

చినుకు పడితే చిత్తడే



ఎంపీడీవో కార్యాలయ కూడలిలో చెరువును తలపిస్తున్న ఆర్ అండ్ బీ రోడ్డు



బ్రాందీ షాపు సమీపంలో తవ్వి పూడ్చకుండా వదిలేసిన కాలువ





రోడ్డు మీద నుంచి గ్రామంలోని వీధుల్లో చేరిన వర్షం నీరు



రోలుగుంట విద్యుత్ కార్యాలయం వద్ద దెబ్బ తిన్న రోడ్డు

రోలుగుంట: చిన్నపాటి చినుకు పడినా రోలుగుంటలో వీధులు, రోడ్లు చిత్తడిగా మారుతున్నాయి. వడ్డాది–నర్సీపట్నం ఆర్ అండ్ బీ (బీఎస్) రోడ్డు పనులు ఇష్టానుసారంగా చేస్తున్నారు. రోడ్డుకు ఇరు పక్కల కాలువలు తవ్వుతున్నారు. రోడ్డు పనులు క్రమ పద్ధతిలో జరగడం లేదు. రోడ్డు విస్తరణ కోసం తవ్విన కాలువలు పూడ్చడంలో కూడా జాప్యం జరుగుతోంది. దీంతో రేయింబవళ్లు రాకపోకలు జరిగే ఈ రోడ్డులో ప్రయాణించే వారు నానా ఇక్కట్లు పడుతున్నారు. అంతే కాకుండా మండల కేంద్రం రోలుగుంటలో అయితే చినుకు పడితే చాలు చిత్తడిగా మారిపోతోంది. ఇళ్లు, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు జలమయం అవుతున్నాయి. రోలుగుంట మండలంలోని నర్సీపట్నం సరిహద్దు వెలంకాయలపాలెం నుంచి నిండుగొండ కూడలి వరకు రోడ్డు గోతులమయం. అక్కడి నుంచి రోలుగుంట పీఏసీఎస్ వరకూ రోడ్డు పనులు చేశారు. అక్కడి నుంచి రోలుగుంట పోలీస్ స్టేషన్ దాటిన తర్వాత కొత్తకోట వెళ్లే దారిలో కొత్తమదుం వరకు గోతులు, అక్కడి నుంచి భోగాపురం వరకూ రోడ్డు పనులు, మళ్లీ కంచుగుమల కూడలి వరకూ గోతుల తర్వాత రోడ్డు పనులు.. ఇలా చోడవరం వెళ్లే వరకు కిలోమీటర్ మేర కూడా పూర్తి స్థాయి పనులు జరగని పరిస్థితి. దీనికి తోడు రోడ్ల విస్తరణ పనుల్లో భాగంగా రోడ్డుకు ఇరువైపుల కొలతల మేరకు కాలువలు తవ్వారు. వీటిలో కొన్ని చోట్ల మెటల్ వేసి, కొన్ని చోట్ల వేయకుండా వదిలేశారు. రోలుగుంట ఎంపీపీ పాఠశాల నుంచి ప్రభుత్వ కార్యాలయాల కూడలి (ఎంపీడీవో కార్యాలయాల సముదాయం) వరకు గోతుల్లో వర్షం పడితే చాలు అవి నీటితో నిండి చెరువులను తలపిస్తాయి. ఈ రోడ్డులో ప్రయాణం చేస్తే నరకం తప్పదని వాహన ఉద్యోగులు, వ్యాపారులు, విద్యార్థులు వాపోతున్నారు. ప్రధానంగా నర్సీపట్నం డిపో నుండి తిరిగే ఆర్టీసీ ఉద్యోగులు ఈ దారిలో ప్రయాణంతో నడుములు విరిగిపోతున్నాయని వాపోతున్నారు. ఇదిలా ఉండగా రోలుగుంట గ్రామంలో గల లోతట్టు వీధులు ఒక మోస్తరు వర్షం పడినా జలమయమై రోజుల తరబడి నీరు నిల్వ ఉండిపోతుంటుంది. అధికారులు, నాయకులు ఈ సమస్యపై స్పందించి రోడ్డు పక్కనున్న కాలువల్లో మెటల్ వేయించి పూడ్చాలని, అరకొరగా జరిగిన రోడ్డు పనులు పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.



ఆర్ అండ్ బీ రోడ్డులోని ప్రైవేట్ ఆస్పత్రి వద్ద ప్రమాదకరంగా ఉన్న గొయ్యి

కాలువ పూడ్చాలి..



చేపట్టిన అభివృద్ధి పనులను పూర్తిస్థాయిలో పూర్తి చేయాలి. మట్టి తవ్వి వదిలేసిన కాలువను పూడ్చాలి. స్థానిక బ్రాందీ షాపు సమీపంలో తవ్వి వదిలేసిన కాలువలో మెటల్ వేసి పూడ్చాలి. లేకుంటే రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. అధికారులు, నాయకులు తగిన చర్యలు తీసుకోవాలి.

– శెట్టి శ్రీను, రోలుగుంట

రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలి..

నేను ఆటో నడుపుతాను. అయితే రోడ్డు గోతులమయంగా మారడంతో తరచూ ఆటో మరమ్మతులకు గురవుతోంది. సంపాదించిన డబ్బులు ఆటో రిపేర్లకే సరిపోతుంది. గోతులు కప్పి రోడ్డు పనులు పూర్తి చేస్తే ఆటో డ్రైవర్లకు మేలు జరుగుతుంది. – ఎస్.రమణాజి, ఆటోడ్రైవర్, రోలుగుంట(మండలం)

వర్షం నీరు ఇళ్లలోకి వస్తుంది..

రోడ్డు పనులు పూర్తి కాక వర్షం నీరు వీధిలో నుండి ఇళ్లలోకి వస్తోంది. దీంతో చాలా ఇబ్బంది పడుతున్నాం. ఆర్ అండ్ బీ అధికారులు రోడ్డు పనులతో పాటు మదుముల్లో పూడికను కూడా తీయిస్తే నీటి నిల్వ సమస్య పరిష్కారమవుతుంది. అధికారులు, నాయకులు మా సమస్యను పరిష్కరించాలి.

– బండారు లక్ష్మి, రోలుగుంట (గ్రామం) మండలం.

ఘనంగా ఓడ్డు పండగ



అమ్మవారి ఘటాలతో ఆలయానికి వెళ్తున్న బూడి రమణమ్మ తదితరులు

మాడుగుల: మాడుగుల ప్రజల ఆరాధ్య దైవం మోదకొండమ్మ అమ్మవారికి 108 ఘటాలతో ఆదివారం ఓడ్డు పండగ నిర్వహించారు. గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కొట్యాడ భాస్కరరావు కుటుంబ సభ్యుల సారథ్యంలో గ్రామ పురవీధుల గుండా ఘటాలతో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ సీఎం, జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బూడి ముత్యాలనాయుడు సతీమణి బూడి రమణమ్మ అమ్మవారి ప్రతిరూపం అయిన ఘటాలను తాకి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు సారథ్యంలో భక్తులకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. అమ్మవారి ఫొటోలు, ప్రసాదం రమణమ్మకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కె. కోటపాడు జెడ్పీటీసీ సభ్యురాలు, జిల్లా పరిషత్ స్టాండింగ్ కమిటీ చైర్‌పర్సన్ ఈర్లె అనురాధ, మాజీ ఎంపీపీ వేమవరపు పెదబాబు, బొమ్మిశెట్టి శ్రీను, నూతిగట్టు గౌరీశంకర్, కొట్యాడ నరేన్ తదితరులు పాల్గొన్నారు.

11,683 మందికి భూమి రిజిస్ట్రేషన్ పూర్తి

మాడుగుల రూరల్: భూదాన్ రిజిస్ట్రేషన్‌కు సంబంధించి మండల వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రిజిస్ట్రేషన్ జరుగుతోందని స్థానిక మండల వ్యవసాయాధికారి ఎం. వాసుదేవరావు ఆదివారం తెలిపారు. మండలంలో 11,683 మందికి రిజిస్ట్రేషన్ పూర్తి చేశామన్నారు. ఖరీఫ్ సీజన్‌లో పచ్చిరొట్ట విత్తనాలు కూడా విక్రయిస్తామని, ప్రభుత్వం నుంచి విత్తనాల రేట్ల వివరాలు వచ్చిన తర్వాత విక్రయిస్తామన్నారు.

ప్రేమసమాజంలో అదనపు సౌకర్యాలు



సోలార్ యూనిట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజు



అదనపు బెడ్ల ఏర్పాటు

చోడవరం: స్థానిక ప్రేమ సమాజంలో మరిన్ని సదుపాయాలు సమకూర్చారు. అనాథలైన వృద్ధులు, వికలాంగులు, విద్యార్థులు ఇక్కడ ఆశ్రయం పొందుతున్నారు. సోలార్ యూనిట్, 20 బెడ్లు, కొత్తగా మరో భవనం, ఫిల్టర్ వాటర్ యూనిట్, వికలాంగులకు ధర్మసత్రం, గ్రంథాలయం, గంజి కేంద్రాలను ఇప్పుడు ఏర్పాటు చేశారు. వీటిని ఎమ్మెల్యే కే.ఎస్ఎన్ఎస్ రాజు, విశాఖ ప్రేమసమాజం చైర్మన్ బుద్ధ శివాజీ, చోడవరం ప్రేమసమాజం అభివృద్ధి కమిటీ చైర్మన్ పూసర్ల రామారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజు మాట్లాడుతూ అనాథలకు ప్రేమసమాజం చక్కటి ఆశ్రయం కల్పిస్తుందన్నారు. అప్పటి కలెక్టర్ అర్జునరావు స్థలసేకరణ చేయడం వల్ల ఇప్పుడు అందరికీ అందుబాటులో ఉందన్నారు. దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మేనేజర్ ప్రసాద్‌రాజు, ఫోరంఫర్ బెటర్ చోడవరం ప్రతినిధులు ఆర్కే ప్రసాద్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాండ్రేగుల డేవిడ్, పుట్టా గంగయ్య, సారాక రమేష్, ఆడమ్స్ వెంకట్రావు, రెడ్డి బలరామ్, ప్రకాశరావు, హరిమోహన్, డాక్టర్ విశ్వేశ్వరరావు, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ సమ్మర్ క్యాంప్ ప్రారంభం



బాక్సింగ్‌లో శిక్షణ పొందుతున్న చిన్నారులు

నర్సీపట్నం: మున్సిపల్ స్టేడియంలో ఏర్పాటు చేసిన సమ్మర్ స్పోర్ట్స్ క్యాంపును వెలగా నారాయణరావు, టూరిజం మేనేజర్ అప్పలనాయుడు ఆదివారం ప్రారంభించారు. సమ్మర్ క్యాంపునకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తామని నింజాస్ అకాడమీ ప్రతినిధులు తెలిపారు. పళ్లు, గుడ్లు, బిస్కట్లు, కేకులు, రాగిజావ అందజేస్తామని నారాయణరావు తెలిపారు. సీనియర్ కోచ్ మాట్లాడుతూ 40 రోజుల పాటు శిక్షణ ఉంటుందన్నారు. కరాటే, వుషు, బాక్సింగ్, వాలీబాల్, కబడ్డీ, బ్యాడ్మింటన్, చెస్, యోగా వంటి క్రీడల్లో శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రయంలో నింజాస్ అకాడమీ డైరెక్టర్లు వెలగా జగన్నాథం, బోశం శివ, బంగారు నాయుడు, ఉమెన్ కోచ్ ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ జాగా... వేసెయ్ పాగా!

- గెడ్డపోరంబోకులో అక్రమ నిర్మాణం
- చోద్యం చూస్తున్న అధికారులు

నర్సీపట్నం : మండలంలో వేములపూడి మేజర్ పంచాయతీలో స్థలాల విలువ పెరగడంతో ఖాళీ స్థలాలు కనబడితే పాక వేస్తున్నారు. ప్రభుత్వ స్థలాలు ఆక్రమణలకు గురవుతున్నా పంచాయతీ అధికారులు చోద్యం చూస్తున్నారన్న విమర్శలు సర్వత్రా వ్యక్తం అవుతున్నాయి. గ్రామ మెయిన్ రోడ్డులో సెంటు స్థలం రూ.15 లక్షల నుండి రూ.20 లక్షలు పలుకుతుంది. దీంతో ఖాళీ స్థలాలపై అక్రమార్కుల కన్ను పడింది. పంచాయతీ కార్యాలయానికి వెళ్లే రోడ్డు మార్గంలో ఉన్న సెంటున్నర గెడ్డపోరంబోకు స్థలాన్ని ఆ గ్రామానికి చెందిన వ్యక్తి ఆక్రమించి రేకుల షెడ్డు నిర్మించాడు. గతంలో షెడ్డు నిర్మాణానికి పాల్పడితే రెవెన్యూ అధికారులు నిలుపుదల చేశారు. కొన్ని నెలలు మిన్నకుండి ఈ రెండు, మూడు రోజుల్లో పోరంబోకు స్థలంలో పర్మనెంట్‌గా షెడ్డు నిర్మాణం జరిగిపోయింది. నిత్యం అదే మార్గంలో సచివాలయానికి వెళ్లే పంచాయతీ కార్యదర్శి, వీఆర్వో చూసీచూడనట్టు వ్యవహరించడంతో ఆక్రమణదారు దర్జాగా నిర్మాణం చేశాడు. రెవెన్యూ, పంచాయతీ అధికారులు మేలుకోకపోతే గ్రామంలోని రూ.లక్షలు విలువ చేసే ప్రభుత్వ స్థలాలు కనుమరుగయ్యే ప్రమాదం ఉందని గ్రామస్తులు అంటున్నారు. ఈ విషయమై వీఆర్వో నవీన్‌ను సంప్రదించగా నిర్మాణం చేయవద్దని చెప్పినా రాత్రి వేళల్లో నిర్మాణం పూర్తి చేశాడని, ఆక్రమణ విషయాన్ని తహసీల్దార్ రామారావు దృష్టికి తీసువెళ్లామన్నారు. తహసీల్దార్ ఆదేశాల మేరకు సోమవారం డిస్మాంటిల్ చేస్తామని వీఆర్వో తెలిపారు. పంచాయతీ పరిధిలో ఉన్నందున తాము కూడా నిర్మాణదారుకు నోటీసు ఇస్తామని ఈవో సత్యనారాయణ తెలిపారు.



ప్రధాన జంక్షన్‌కు ఆనుకుని ఉన్న గెడ్డపోరంబోకు స్థలంలో వెలసిన అక్రమ నిర్మాణం

రహదారుల నిర్మాణంతో ట్రాఫిక్ జామ్

మాడుగుల రూరల్: వడ్డాది నుంచి తాటిపర్తి వరకు ప్రధాన రహదారి నిర్మాణం జరుగుతోంది. అలాగే ఎం. కోటపాడు వల్లాపురం గ్రామాల మధ్య సిమెంట్ రోడ్డు నిర్మిస్తున్నారు. ఇక్కడ ఒక వైపు నిర్మాణం పూర్తి కాగా, మరో వైపు పనులు జరుగుతున్నాయి. దీంతో పాడేరు, మాడుగుల నుంచి చోడవరం వైపు వెళ్లే వాహనాలు, చోడవరం నుంచి పాడేరు, మాడుగుల వైపు వెళ్లే వాహనాలతో ఈ రహదారిలో ట్రాఫిక్ జామ్ అవుతోంది. దీంతో పాటు కె.జె.పురం జంక్షన్‌లో కూడా సీసీ రోడ్డు నిర్మాణం ఒక వైపు పూర్తి అయింది. రెండో వైపు 150 మీటర్ల రోడ్డు నిర్మాణం జరుగుతోంది. ఈ కారణం వల్ల ట్రాఫిక్ జామ్ అవుతోంది. కొన్ని వాహనాలు కె.జె.పురం, దబ్బకుంట మీదుగా తిరుగుతున్నాయి. ట్రాఫిక్ జామ్‌తో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు.



ఎం. కోటపాడు వద్ద నిలిచిపోయిన వాహనాలు

పార్కు నిర్మాణ పనుల్లో నాణ్యతా లోపం

విచారణకు సీపీఎం నేత వెంకన్న డిమాండ్



దేవరాపల్లిలో నిర్మాణంలో ఉన్న పార్కు

దేవరాపల్లి: స్థానికంగా వీఎంఆర్డీఏ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న పార్కు పనుల్లో నాణ్యతా ప్రమాణాలు లోపించాయని, సమగ్ర విచారణ జరపాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు డి. వెంకన్న డిమాండ్ చేశారు. పనుల్లో నాణ్యత పాటించని వారిపై చర్యలు తీసుకోవాలని ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో అన్నారు. ఈ పనుల్లో నిధులు దుర్వినియోగం అవుతున్నాయని ఆయన ఆరోపించారు. ప్రస్తుతం రూ. 22 లక్షలతో ట్రాక్ నిర్మాణ పనులు చేస్తున్నారని, కింద నేల చదును చేయకుండా, రోలింగ్ చేపట్టకుండా తూతూ మంత్రంగా పనులు చేపడుతున్నారని విమర్శించారు. నాణ్యతా లోపం కారణంగా సీసీ ట్రాక్ తక్కువ రోజుల్లో పగుళ్లు వచ్చే ప్రమాదం పొంచి ఉందన్నారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి పక్కాగా పనులు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో సుమారు రూ.40 లక్షలతో ప్రహరీ, ఇతర పనులు చేపట్టగా సార్వత్రిక ఎన్నికల తర్వాత ఈ పనులు నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో తాజాగా ట్రాక్ నిర్మాణ పనులు చేపడుతున్నారు.

క్లబ్ సేవలు విస్తృతం చేయాలి

నర్సీపట్నం: సామాజిక సేవలను విస్తృతం చేయాలని వాసవీ క్లబ్ అంతర్జాతీయ అధ్యక్షుడు ఇరుకుల్లు కృష్ణారావు పేర్కొన్నారు. నర్సీపట్నంలో ఆదివారం ఆయన పర్యటించి మాట్లాడారు. పేదలను ఆదుకునేందుకు క్లబ్ కృషి చేయాలని పిలుపునిచ్చారు. క్లబ్ చేపడుతున్న సేవలకు అంతర్జాతీయంగా మంచి స్పందన వస్తుందన్నారు. పేదలు చనిపోయినప్పుడు అంత్యక్రియల నిర్వహణకు క్లబ్ ద్వారా రూ.25 వేలు ఆర్థిక సహాయం అందిస్తున్నామన్నారు. ఈ ఏడాది రెండు లక్షల నోట్ పుస్తకాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. బాలికలకు ఉచితంగా సైకిళ్లు పంపిణీ చేశామన్నారు. ప్రభుత్వ పాఠశాలలకు వాటర్ ట్యాంకులు ఉచితంగా అందజేశారు. అనంతరం ఆయనను క్లబ్ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో క్యాబినెట్ టీం వెలగా నారాయణరావు, పద్మనాభుని రాజేశ్వరి, దేవత అరుణ, వైస్ గవర్నర్ కంచర్ల రమేష్, శ్రీను, వనిత క్లబ్ ప్రెసిడెంట్ గ్రంధి రాధ, సెక్రెటరీ కె.విజయలక్ష్మి, ట్రెజరర్ దాసరి దేవి, క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ పాఠశాలకు వాటర్ ట్యాంక్ అందజేస్తున్న అధ్యక్షుడు కృష్ణారావు

ఘనంగా ఈస్టర్ వేడుకలు



ఈస్టర్ వేడుకల్లో పాల్గొన్న క్రైస్తవులు

నర్సీపట్నం: మున్సిపాలిటీలోని పెదబొడ్డేపల్లి ఆర్సీఎం చర్చితో పాటు అన్ని చర్చిల్లో ఈస్టర్ పండగను క్రైస్తవులు ఘనంగా జరుపుకున్నారు. కొవ్వొత్తులు వెలగించి కార్యక్రమాన్ని ఆరంభించారు. భక్తిశ్రద్ధలతో పండగ జరుపుకున్నారు. ఫాదర్ శౌరిబాబు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దైవ కీర్తనలతో చర్చిలు మార్మోగాయి. ఆర్సీఎం చర్చిలో ఏర్పాటు చేసిన ఏసుప్రభువు ఉత్థానం సెట్ విశేషంగా ఆకట్టుకుంది. ఈ వేడుకల్లో డాన్‌బాస్కో కాలేజీ రెక్టర్ ఫాదర్ బెన్నీ, ఆర్సీఎం సహాయ గురువులు పాల్గొన్నారు.



ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ఫాదర్ శౌరిబాబు

ముగిసిన అగ్నిమాపక వారోత్సవాలు

నర్సీపట్నం: అగ్నిమాపక వారోత్సవాలు ముగిసాయి. స్థానిక అగ్నిమాపక కేంద్రంలో ఆదివారం వారోత్సవాల ముగింపు సందర్భంగా ఫైర్ ఆఫీసర్ అప్పలస్వామి మాట్లాడారు. వారోత్సవాల్లో భాగంగా వారం రోజులపాటు సబ్ డివిజన్ పరిధిలో ప్రజలకు పలుచోట్ల అవగాహన కార్యక్రమాలు నిర్వహించామన్నారు. అగ్నిమాపక శాఖ త్యాగాలు, సేవలు, ప్రజల భద్రతపై అవగాహన కల్పించారు. ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సేఫ్టీ టిప్స్ తెలియజేశారు. ముఖ్యమైన చర్యలు, ఎమర్జెన్సీ నంబర్లను ప్రజల దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ప్రమాద సమయంలో వినియోగించే అగ్నిమాపక పరికరాల పనితీరు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు అర్జున్ వెంకట్రావు, కుంచా వెంకటరమణ, రాజు, ఫైర్ సిబ్బంది అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



పరికరాల వినియోగం గురించి వివరిస్తున్న ఫైర్ సిబ్బంది

నిరుపయోగంగా పాఠశాల భవనం

కె.కోటపాడు: మండలంలో భూమిరెడ్డిపాలెం గ్రామంలో పాఠశాల నిరుపయోగంగా ఉంది. పదేళ్ల క్రితం వరకు ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఇక్కడ విద్య అందేది. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందన్న కారణంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు విద్యాశాఖ అధికారులు దీన్ని మూసేశారు. దీంతో పదేళ్లుగా భూమిరెడ్డిపాలెం, లెక్కలపైడమ్మపాలెం గ్రామాలకు చెందిన విద్యార్థులు ప్రాథమిక పాఠశాల చదువులకు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న గవరపాలెం గ్రామానికి వెళ్లాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ప్రతి రోజూ కాలినడకన విద్యార్థులు వెళ్లి వస్తుండడం వల్ల అనారోగ్య సమస్యల బారిన పడుతున్నట్లు విద్యార్థుల తల్లిదండ్రులు చెబుతున్నారు. ప్రస్తుతం ఈ రెండు గ్రామాల్లో గల బడిఈడు పిల్లల సంఖ్యను విద్యాశాఖాధికారులు గుర్తించి గ్రామంలో ఉన్న పాఠశాలను తిరిగి ప్రారంభించాలని విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు కోరుతున్నారు.



భూమిరెడ్డిపాలెంలో వాడుకలో లేని పాఠశాల

ఆలయ నిర్మాణంలో భాగస్వాములు కావాలి



వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి విరాళం అందజేస్తున్న పావని

మునగపాక: ప్రతి ఒక్కరూ కలియుగ దైవం శ్రీనివాసుని ఆలయ నిర్మాణంలో భాగస్వాములు కావాలని వేంకటేశ్వర స్వామి ఆలయ కమిటీ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్ కోరారు. మునగపాకలో రూ.5 కోట్లతో నిర్మిస్తున్న వేంకటేశ్వర స్వామి ఆలయానికి విరాళాలు అందించాలన్నా రు. ఆదివారం మునగపాకకు చెందిన దొడ్డి నాగరాజు, పావని దంపతులు రూ.7,777 విరాళంగా అందజేశారు. మునగపాకకు చెందిన పెంటకోట దేవన్‌రాజు, సూర్యం దంపతులు రూ.10 వేల విరాళం అందించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఆడారి అచ్చియ్యనాయుడు, ఆడారి కాశీబాబు, పాలిమేర కృష్ణ, వెలగా శ్రీనివాసరావు, ఆడారి రమణ బాబు, పెంటకోట శ్రీను(నెట్), ఆడారి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.